# మహబూబ్‌నగర్‌కు ఆర్జీయూకేటీ

- మూడు కోర్సులు, 180 సీట్లు
- ఈ విద్యాసంవత్సరమే క్యాంపస్ అందుబాటులోకి
- మొత్తం సీఎస్ఈ సీట్లతోనే కొత్త ఆర్జీయూకేటీ క్యాంపస్
- కోర్ కోర్సులను ప్రోత్సహిస్తామని మాట తప్పిన రేవంత్ సర్కారు

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో మరో ఆర్జీయూకేటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మహబూబ్‌నగర్‌లో రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ(ఆర్జీయూకేటీ)ని ఏర్పాటు చేస్తూ విద్యాశాఖ జీవో-24ను విడుదల చేసింది. మూడు కోర్సులు, 180 సీట్లతో ఈ విద్యాసంవత్సరం నుంచే కొత్త క్యాంపస్ అందుబాటులోకి రానున్నది. ఈ క్యాంపస్‌లో ప్రారంభించే మొత్తం కోర్సులు సీఎస్ఈ కోర్సులే కావడం గమనార్హం. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్(ఏఐఎంఎల్), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డాటాసైన్స్) కోర్సులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. గతంలో కోర్ ఇంజినీరింగ్ కోర్సులను ప్రోత్సహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కానీ వాస్తవ పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. మహబూబ్‌నగర్ ఆర్జీయూకేటీలో మూడు సీఎస్ఈ కోర్సులనే ప్రవేశపెట్టారు. ఒక్క కోర్ కోర్సును కూడా ప్రవేశపెట్టలేదు. దీంతో కంప్యూటర్ సైన్స్ కోర్సులకు బదులు కోర్ ఇంజినీరింగ్ కోర్సులు ప్రవేశపెడతామన్న సర్కారు హామీ ఉత్తదే అయ్యింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలోనూ ఆర్జీయూకేటీ క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరినా.. ప్రసుత్తం ఈ ప్రతిపాదనలను సర్కారు పెండింగ్‌లో పెట్టింది. సీఎం రేవంత్ సొంత జిల్లా కావడంతో ఆగమేఘాల మీద బుధవారం మహబూబ్‌నగర్‌కు కొత్త ఆర్జీయూకేటీని మంజూరుచేస్తూ జీవో జారీచేసింది.

## ఆర్జీయూకేటీ నోటిఫికేషన్ విడుదల

బాసర, మే 28 : బాసర ఆర్జీయూకేటీలో ప్రవేశాల కోసం 2025-26 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్‌ను బుధవారం వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాసర సెంటర్‌లో 1500 సీట్లు, మహబూబ్‌నగర్ సెంటర్‌లో 180 సీట్లకు ఆరేండ్ల సమీకృత విద్యావిధానంలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించడానికి అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల చేశామని తెలిపారు. పూర్తి వివరాలను ట్రిపుల్ ఐటీ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచామని పేర్కొన్నారు.



నోటిఫికేషన్ విడుదల చేస్తున్న వీసీ

# విద్యార్థులు టాయిలెట్లు కడిగితే తప్పేంటి?

- వాళ్లంతా పాష్ సొసైటీ నుంచి రాలే
- పిల్లలతో పనులు చేయించుకుంటాం
- పనులు చేయిస్తున్నారని తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే షోకాజ్ నోటీసులు ఇస్తాం
- ఎస్సీ గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిణి వివాదాస్పద వ్యాఖ్యలు
- సోషల్ మీడియాలో ఆమె మాటల ఆడియో వైరల్

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): 'గురుకులాల్లో చదివే విద్యార్థులతో పనులు చేయించుకుంటాం.. వాళ్లు వాడే టాయిలెట్లను వారే కడుక్కుంటే తప్పేంటి.. వాళ్లేమీ పాష్ సొసైటీ నుంచి వచ్చిన వాళ్లేమీ కాదు.. వాళ్లు కూర్చున్న వెంటనే టేబుల్ మీదికి భోజనం వస్తుందని భావిస్తే కుదరదు. ఇలా టేబుల్‌పై కొడితే క్లీనింగ్‌కు మనుషులు వస్తారంటే కలవదు' అని రాష్ట్ర ఎస్సీ గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిణి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె మాట్లాడినట్టు ఉన్న ఓ ఆడియో సోషల్ మీడియాలో సర్క్యులేట్ అయింది. ఈ ఆడియోలో ఆమె మాట్లాడిన వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. గురుకులాల్లో చదివే పిల్లలు ఆర్థిక స్థోమత తక్కువ ఉన్నావాళ్లే అని ఆమె చులకనగా మాట్లాడారు. ఎవరైనా పిల్లలతో పనులు చేయించుకుంటున్నారని బెదిరిస్తే నా ఆర్డర్ అని చెప్పండని అధికారులకు హుకూం జారీ చేశారు. విద్యార్థులు చపాతీ చేయాల్సి వస్తే చేయాల్సిందేనని ఆదేశించారు. జమ్మికుంట నుంచి కొందరు విద్యార్థులతో చపాతీ చేయిస్తున్నారని తనకు ఫొటోలు పంపారని, విద్యార్థులు చేస్తే మంచిదే కదా అని వారితో అన్నానని చెప్పారు. పిల్లలతో గదులు శుభ్రం చేయిస్తే మంచిదే కదా అని ఆమె సెలవిచ్చారు. స్వీపర్లు వచ్చి ప్రతిసారీ వచ్చి గదులను ఎలా శుభ్రపరుస్తారని, విద్యార్థులే ఎందుకు తమ గదులను శుభ్రం చేసుకోకూడదని ప్రశ్నించారు.



### తల్లిదండ్రులకు షోకాజ్ నోటీసులు

గురుకులాల్లో చేపట్టే పనులను విద్యార్థులకు ప్రిన్సిపాళ్లు షేర్ చేయాలని ఎస్సీ గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిణి ఆదేశించినట్టు ఆ ఆడియోలో ఉన్నది. ఈ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చి నిర్దాక్షిణ్యంగా బయటకు పంపించేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి బెదిరిస్తే కుదరదని వార్నింగ్ ఇచ్చారు. తాను స్కూళ్లకు వెళ్లినప్పుడు పిల్లలు కనీసం బూజు కూడా దులపడంలేదని.. వాళ్లు ఎందుకు అలా చేయలేదో తనకు అర్థం కాలేదని పేర్కొన్నారు. విద్యార్థులు పనులు చేసేటప్పుడు ఫొటో తీసి పంపిస్తే తాను భయపడేది లేదని స్పష్టంచేశారు. విద్యార్థులు తప్పకుండా తాము ఉంటున్న వాతావారణాన్ని శుభ్రం చేసుకోవాల్సిందేనని ఆమె తేల్చిచెప్పారు. పిల్లలతో పనులు చేయించే విషయంలో గురుకులాల సిబ్బందిలో ఎలాంటి భయాలొద్దని ఆమె భరోసా ఇచ్చినట్టు ఆ ఆడియోలో ఉన్నది.

### రాజకీయాలు చేయొద్దు

గురుకులాల విషయంలో రాజకీయాలు చేయొద్దని ఎస్సీ గురుకుల సెక్రటరీ అలుగు వర్షిణి కోరారు. ఈ మేరకు ఆమె బుధవారం ఓ ఆడియో ప్రకటన విడుదల చేశారు. ఆధారాలు లేకుండా చేసే ఆరోపణలు సరికాదని తెలిపారు. వారం ముందు జరిగిన సంఘటనకు సంబంధించిన ఆడియోను ఎడిట్ చేసి సర్క్యులేట్ చేయడం ద్వారా ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళ్తాయని చెప్పారు. విద్యార్థుల సంక్షేమానికి వ్యతిరేకంగా కొందరు కావాలనే ఇలాంటి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) విద్యార్థులకు ఇబ్బంది కలిగించే ఎలాంటి నిర్ణయం తీసుకోదని స్పష్టంచేశారు. విద్యార్థులు వంట చేయాల్సి వస్తే చేయాల్సిందేనని, తాము ఉండే పరిసరాలు, తమ గదులు, వాష్ రూమ్‌లు క్లీన్‌గా ఉంచుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపైనే ఉన్నదని మరోసారి చెప్పారు. ఉన్న సిబ్బందిని పక్కన పెట్టి విద్యార్థులతో ఎలాంటి పనులు చేయించడం లేదని., ఆయా పనుల్లో విద్యార్థుల సేవలను మాత్రమే వాడుకుంటామని చెప్పారు. విద్యార్థులు ఇంట్లో ఉండి ఏమేమి చేసుకుని చదువుకుంటారో అలాంటి వాతావరణమే ఇక్కడ కల్పిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు ఇక్కడి నుంచి బయటకు వెళ్లాక అన్ని విషయాలపై అవగాహన గల పౌరులుగా ఎదగాలనేదే తమ ఆకాంక్ష అని చెప్పుకొచ్చారు.

# పనులు చేయించడం అమానుషం

- చులకనగా మాట్లాడిన ఐఏఎస్‌ను తప్పించాలి
- సిబ్బంది తొలిగింపు దారుణం
- బీఆర్ఎస్ హయాంలో ప్రతీ గురుకులానికి రూ.40 వేలు
- ఆ నిధులతో తాత్కాలిక పద్ధతిలో నలుగురి సిబ్బందితో పనులు
- గురుకుల విద్యాలయాలపై కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): గురుకుల విద్యాలయాల్లో శానిటేషన్ వర్కర్లను తొలిగించి, చదువుకోవడానికి వచ్చిన విద్యార్థులతోనే ఆ పనులు చేయించడం అమానుషమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. విద్యార్థులతో శానిటేషన్ పనులు చేయించడం నేరమని బుధవారం ఎక్స్ వేదికగా విమర్శించారు. ఎస్సీ గురుకులాల్లో చదివే పిల్లలు 'ఏమైనా పోష్ బ్యాక్‌గ్రౌండ్ నుంచి వచ్చారా? వెళ్లి కూర్చోగానే టేబుల్‌పైకి ఫుడ్ రాదు అనడం? ఎందుకు ఇలాంటి పనులు చేయరు? వాటిని చేయాల్సిందే' అని స్వయంగా ఒక ఐఏఎస్ స్థాయి అధికారి అనడం దారుణమని విమర్శించారు. పిల్లల పట్ల వివక్షాపూరిత వ్యాఖ్యలు చేసిన ఆ అధికారిని తక్షణమే బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఎస్సీ గురుకుల పాఠశాలల్లో కొనసాగుతున్న స్వీపర్లు, శానిటేషన్ వర్కర్లను తొలిగించాలని కాంగ్రెస్ సర్కార్ నిర్ణయించడం దారుణమని ధ్వజమెత్తారు. ఆయా గురుకులాల్లో విద్యర్థులతో వెట్టిచాకిరీ చేయించాలని చూడటం అమానుషమని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్వీపింగ్, శానిటేషన్ కోసం ప్రతి గురుకులానికి రూ.40 వేలు కేటాయించారని, వాటితో తాత్కాలిక పద్ధతిలో నలుగురు సిబ్బందితో పనులు చేయించారని గుర్తుచేశారు. మే నెల నుంచి ఈ పద్ధతిని కాంగ్రెస్ సర్కార్ తొలగించడంతో మరుగుదొడ్లు, ఇతర గదుల శుభ్రతతోపాటు గురుకుల పాఠశాల, హాస్టల్ ఆవరణలోని పనులన్నీ గురుకుల విద్యార్థులే చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1,200 మంది ఉద్యోగులను తొలిగించడం తీవ్ర అన్యాయమని కవిత నిప్పులు చెరిగారు.



### విద్యార్థులతో వెట్టిచాకిరీ

రాష్ట్రంలోని 240 గురుకులాల్లో అసిస్టెంట్ కేర్‌టేకర్లను తొలిగించి, వారు చేసే వార్డెన్ పనులను అక్కడి విద్యార్థులతోనే చేయిస్తున్నారని ఆమె మండిపడ్డారు. ఇప్పటి వరకు వార్డెన్లే అన్నిరకాల పనులు చూసుకున్నా, విద్యార్థులు కమిటీగా ఏర్పడి, క్వాలిటీని చెక్ చేసుకునే సంప్రదాయం ఉండేదని, కానీ ఆ పిల్లలే ఇక నుంచి వంటశాల నిర్వహణతోపాటు మెస్ పనులు కూడా చేయాల్సిన పరిస్థితి తలెత్తిందని తెలిపారు. వివక్షల నుంచి తప్పించడానికే ఎస్సీ గురుకుల హాస్టళ్లు ఏర్పాటు చేసి, పిల్లలను చదివించేదని పేర్కొన్నారు. గతంలో మాదిరిగానే విద్యార్థులకు క్వాలిటీని మాత్రమే తనిఖీ చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. పూర్తిస్థాయి వార్డెన్, శానిటేషన్ వర్కర్లు చేసే పనులను పిల్లలతో చేయించొద్దని కోరారు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.